# విపశ్యన మాసపత్రిక

VOLUME:34 NO - 25 1 APRIL, 2020

(సాధకుల ప్రేరణ కొరకు ఉద్దేశించబడిన తెలుగు మాసపత్రిక)

విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం, ధమ్మఖెత్త, వనస్థలిపురం, హైదరాబాదు – 70

### "ధర్మవాణి"

*ఖన్తీ పరమం తపో తితిక్ఖా, నిబ్బానం పరమం వదన్తి బుద్ధా !*
*నహి పబ్బజితో పరూపఘాతీ, న సమణో హోతి పరం విహేఠయన్తో!!*

*– ధమ్మపద – 184, బుద్ధవగ్గో*

సహనశీలత మరియు క్షమాశీలతలు గొప్ప తపస్సులు (తప్పకుండా తపస్సు చేయదగినవి). బుద్ధులు నిర్వాణాన్ని ఉత్తమమైనదిగా వర్ణిస్తారు. ఇతరులను గాయపరిచేవారు ప్రవ్రజితులు కారు, అలాగే ఇతరులను పీడించేవారు శ్రమణులు కాలేరు.

## విపశ్యనా సాధన స్వర్ణ జయంతి సందర్భంగా పూజ్య గురూజీ పట్ల కృతజ్ఞతను ప్రకటించుకునే సదవకాశం

**(మూలం: మే 18, 2019 న వెలువడిన హిందీ మాసపత్రిక )**

*విపశ్యనా సాధన పునఃస్థాపితమై 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 3 జూలై 2018 నుండి గ్లోబల్ పగోడాలో, ప్రతిరోజూ ఒక్కరోజు శిబిరాలు క్రమబద్ధంగా నిర్వహించబడుతున్నాయి. ఈ శిబిరాలు సాధకుల రోజువారీ సాధనను పుష్టి చేయడానికి సహాయ పడగలవని ఆశించటం జరుగుతోంది. సాధకులకు ఏరోజు సమయం దొరికితే, ఆ రోజు ఈ శిబిరాల నుండి ప్రయోజనం పొందారు. వీటితో సాధకుల సాధనలో కూడా నిరంతరత మరియు క్రమబద్ధత వచ్చి, ఆ తరువాత అలాంటి వారి నుండి ప్రేరణ పొంది, ఇతరులలో సద్ధర్మం పట్ల ఆసక్తి కలిగితే, వీలయినంత ఎక్కువ మంది శిబిరాల్లో పాల్గొని, తమ మేలు చేకూర్చుకుంటారు. ఇదే విధంగా, ఇతర ప్రాంతాల్లో కూడా, రోజువారీ సాధన, సామూహిక సాధన మరియు ఒక్కరోజు శిబిరాల ద్వారా ఈ విద్య యొక్క వ్యావహారిక పక్షాన్ని అంటే సాధన యొక్క ఆచరణను దృఢపరుచుకోడానికే ఈ శిబిరాలు జరుపుకోబడుతున్నాయి. ఇదే పూజ్య గురుదేవుల పట్ల మనం చూపించే అసలైన శ్రద్ధాంజలి, నిజమైన కృతజ్ఞత అవుతుంది.*

*విశ్వ విపశ్యనాచార్యులు పూజ్య శ్రీ సత్యనారాయణ గోయంకా గారు శుద్ధ ధర్మంతో సంపర్కంలోకి రాకముందు, వారి బాల్యం నుండి యవ్వన దశ వరకూ జరిగిన సంఘటనల వర్ణనల ఆధారంగా వారిలోని భక్తి భావాన్ని గురించి ఎలాంటి భ్రమా కలగకూడదు, పైపెచ్చు, ధర్మం చేత అలాంటి వ్యక్తిలో కూడా ఎంతలా మార్పు వచ్చిందో తెలుసుకొని ప్రేరేపితులౌతారనే ఉద్దేశ్యంతోనే, వారి ఈ సంక్షిప్త జీవిత పరిచయం, వారి మాటల్లోనే*

**– తొమ్మిదవ భాగం.**

### నా జీవితం మీద స్వామీ వివేకానంద గారి ప్రగాఢ ప్రభావం

స్వామీ వివేకానంద గారి పట్ల నేను ఎల్లప్పుడూ శ్రద్ధావంతుడిగా ఉన్నాను. యుద్ధం తరువాత, నేను మయన్మార్‌లోని రంగూన్ నగరంలో ఉన్న శ్రీరామకృష్ణ మిషన్ సొసైటీ మరియు శ్రీరామకృష్ణ మిషన్ సేవాశ్రమాల్లో క్రియాశీలంగా సేవ చేస్తూ విద్వాంసులు, ఉన్నత వ్యక్తిత్వం కలవారు, కరుణాహృదయులు మరియు సేవాభావం కలవారైనటువంటి అక్కడి సన్యాసులతో కలిసి పని చేయటం మరియు వారి సాంగత్యంతో ఉండటం నాకెంతగానో ఉపయోగపడింది. వారి ద్వారానే స్వామీ వివేకానంద గారి ఆకర్షణీయ వ్యక్తిత్వం మరియు వారి ప్రభావవంతమైన నడవడిక గురించిన విలువైన సమాచారం లభించింది. దానితో నాకెంతగానో ప్రేరణ కలిగింది.

కొన్ని సంవత్సరాల క్రితం దక్షిణ భారతదేశంలో విపశ్యనా శిబిరాన్ని నిర్వహిస్తూ మా కుటుంబంలోని కొందరు సభ్యులతో కన్యాకుమారికి తీర్థయాత్రకు వెళ్లాను. అక్కడ పవిత్ర భారతభూమి యొక్క దక్షిణ తీరాన్ని మూడు సముద్రాల జలాలు స్పృశిస్తుంటాయి. మూడు సముద్రాలు కలిసి భరతమాత పాదాలు కడుగుతున్నాయా అన్నట్లుగా ఉంటుంది.

బోధిసత్వునికి బుద్ధత్వం ప్రాప్తించటానికి ముందురోజు రాత్రి, తాను బుద్ధ స్వరూపంలో తన బృహత్కాయంతో ఉన్నట్లుగా కనిన కలలో కనిపించిన స్థానమిదే. ఆ కలలో వారు ఎత్తైన హిమాలయా పర్వతాలు తలగడగా, తన శరీరం భారతదేశ భూభాగమంతటా విస్తరించి పడుకుని ఉండగా, వారి పాదాలు ఈ కన్యాకుమారి ఒడ్డు వరకు వ్యాపించి ఉన్నట్లుగా చూశారు. అక్కడ మూడు సముద్రాల

నీరు వారి పాదాలను ప్రక్షాళన చేసి గౌరవం పొందుతున్నట్లున్నాయి. ఆ స్వప్నంలో, ఆ విశాల ఆకృతి కల బుద్ధ భగవానుని ఒక చేయి బంగాళాఖాతం ఒడ్డున, మరొక చేయి అరేబియా సముద్రం ఒడ్డు వరకూ వ్యాపించి ఉండగా, సముద్ర కెరటాలు వారి చేతులను ప్రక్షాళన చేస్తూ పరవళ్ళు తొక్కుతున్నాయి. ఈ కల – భగవానుని పవిత్రమైన బోధనలు రానున్నకాలంలో భారతదేశమంతటా సహర్షంగా స్వీకరించబడతాయి. ఆ తరువాత హిమాలయాలు దాటి ఉత్తర దిక్కుకు మరియు ఈ సముద్రతీరాలు దాటి ఇతర దిక్కులలో ఉన్న దేశవిదేశాల్లోకి వ్యాప్తి చెందుతాయి. అనే సత్యానికి పూర్వ సూచన.

స్వామీ వివేకానందుడు ఈ తీరం నుండే ఈదుతూ ఎదురుగా ఉన్న రాతిగుట్టను చేరుకుని మూడురోజుల పాటు అక్కడే ధ్యానమగ్నులై ఉన్నారు. ప్రతి భారతీయునికీ మూడు విధాలా పావనమైన ఈ స్థానం భావనాత్మకంగా ఎంతో ప్రముఖమైనది.

భారతీయ ద్వీపకల్పం యొక్క ఈ అంతిమ దక్షిణ తీరం వద్ద మూడు సముద్రాల స్నేహ సంగమం, మూడింటి నీటి అలలు ఒకదానికొకటి తాకుతూ ఒడ్డున ఆడుతున్న క్రీడ అత్యంత మనోహరంగా అనిపించింది. మేము అక్కడి ఒడ్డున కుర్చుని ఆ అపూర్వ మనోరమ్యమైన దృశ్యాన్ని ఆనందంతో వీక్షిస్తూ ఉన్నాము. ఇంతలో ముగ్గురు నలుగురు నవయువకులు చిరునవ్వుతో మా వైపుకు వచ్చి నమస్కరించి, "తాము స్థానిక వివేకానంద కేంద్ర కార్యకర్తలమని" వారు మాతో చెప్పారు. మా రాక గురించి వాళ్లకు ఎటువంటి సమాచారమూ లేకున్నది. కానీ అందులో ఒకరిద్దరు విపశ్యనా ధ్యాన సాధకులు కావటంతో వారు నన్ను గుర్తుపట్టారు. ఎంతో ప్రేమతో, గౌరవంతో మార్గదర్శనం చేస్తూ, మాకు పరిచయంలేని, తెలియని ఆ స్థానం యొక్క తీర్థయాత్రను ఎంతో సుఖవంతంగా, ఫలవంతంగా చేశారు. మేము కృతార్థులమయ్యాము.

వారు మమ్మల్ని ఒక చిన్న పడవలో వివేకానంద ద్వీపానికి తీసుకుని వెళ్ళారు. అక్కడ ఉన్న భవ్యమైన, కళాపూర్ణ మందిరాన్ని చూశాము. అక్కడ లోపల నిర్మించబడిన ఒక ధ్యానమందిరంలోకి మమ్మల్ని తీసుకుని వెళ్ళారు. స్వామీజీ ఇక్కడే మూడు రోజుల పాటు తపస్సు చేశారని ప్రతీతి. మేము కూడా ఆ పవిత్ర స్థానంలో కొన్ని గంటల పాటు ధ్యానం చేసుకుని ఎంతో సంతోషంతో నిండిపోయాము.

ధ్యానం చేస్తుండగా మనసులో ఒక దృఢమైన ధర్మసంవేగం జనించింది – "సాహసవంతులు మరియు త్యాగశీలురైన ధర్మదూత భిక్షువుల ద్వారా బుద్ధ భగవానుని శుభప్రదమైన వాణి మరియు విపశ్యనా విద్య చాలాకాలం క్రిందట హిందూ మహాసముద్రము, బంగాళాఖాతము మరియు అరేబియా సముద్రాల ఎత్తైన కెరటాలను దాటి దేశవిదేశాలకు వెళ్ళినట్లే, సమీప భూతకాలంలో స్వామీ వివేకానందుని ద్వారా, భారతదేశపు మరో మహత్తరమైన ఆధ్యాత్మిక పరంపర దూరదేశాలకు వ్యాపించినట్లే, ఇప్పుడు కూడా సర్వజనహితకారైన విపశ్యనా విద్య మరొక్కసారి నలుదిక్కులకూ పాకి ఆరు మహాద్వీపాలకూ వ్యాపించి, అక్కడ దుఃఖంతో తపిస్తున్న మానవులను సద్ధర్మ సుధాధారతో సంతృప్తపరచి, వారిని భవచక్రపు దుఃఖాల నుండి ముక్తులను చేస్తుంది. ఈ ద్వితీయ బుద్ధశాసన కాలంలో భారతదేశపు పావనభూమి మరొక్కసారి లోకానికి కళ్యాణం చేకూర్చే గౌరవాన్ని పొందుతుంది. సమీపాన దక్షిణదిక్కులో హిందూ మహాసాగరంతో నిత్యాభిషేకం చేయించుకునే ముడుచుకున్న తామరమొగ్గ వంటి ధర్మద్వీపమైన శ్రీలంక, తూర్పుదిక్కున భారతదేశపు పుణ్యభూమికి ఆనుకుని ఉన్న నా జన్మభూమి అయిన పవిత్ర బర్మాలతో పాటుగా బుద్ధ సంతతితో ఆసియా ఖండమంతటా వ్యాప్తి చెందిన ఇతర ధర్మదేశాలు కూడా ఈ పుణ్య ప్రయాణంలో సహాయాన్నందించి పుణ్యలాభాన్వితులు కావాలనే" మంగళకర భావనలతో మేము మా సుదూర దక్షిణ భారతదేశపు తీర్థయాత్రను ముగించాము.

స్వామీ వివేకానంద గారు తన అంతిమ రోజుల్లో కొద్ది రోజుల పాటు బుద్ధగయాలోని బోధివృక్షం నీడలో ధ్యానం చేసుకుంటూ గడిపారు అని కూడా తెలుసుకుని నాకెంతో ప్రసన్నత కలిగింది. వారు వివేకానంద ద్వీపంలోనూ, బోధివృక్షపు నీడలోనూ వారు ఎటువంటి ధ్యానసాధన చేశారో మనకు తెలియదు. కానీ వారు విపశ్యన అయితే చేసి ఉండరు అనే విషయం స్పష్టంగా తెలుస్తుంది. ఎందుకంటే ఆ సమయానికి విపశ్యనా విద్య ఇంకా తిరిగిరాలేదు. అప్పటికి తన ఈ పురాతన అమూల్యమైన వారసత్వ సంపద గురించి భారతదేశానికి బొత్తిగా తెలియదు.

బహుశా! స్వామీ వివేకానంద వంటి విలక్షణ ప్రతిభావంతుడైన వ్యక్తికి భారతదేశపు పురాతన విపశ్యనా విద్య, దానితో పాటుగా బుద్ధ భగవానుని మూలవాణి ప్రాప్తించి ఉంటే దాని పరిణామం ఎంతో మంగళకరంగా ఉండేది. వారి మనసులో బుద్ధ భగవానుని వ్యక్తిత్వం పట్ల ఉన్నంత శ్రద్ధానిష్ఠలే వారి బోధనల పట్ల కూడా ఉండేవి. భారతదేశంలో తరతరాలుగా నడుస్తూ వస్తున్న దురదృష్టకర మిథ్యా ప్రచారాల కారణంగా వారి మనస్సులో ఉదయించిన భ్రాంతులు తప్పకుండా దూరమైపోయేవి. అలా జరిగి ఉంటే దేశానికి మరియు ప్రపంచానికి వారు ప్రసాదించిన ఆధ్యాత్మిక వరం ఎన్నోరెట్లు మహత్తరమైనదిగా అయి ఉండేది. కానీ విపశ్యన విద్య మరియు బుద్ధుని మూల బోధనలు వాటి సమయం ఆసన్నమైనప్పుడే మళ్ళీ ఉదయించగలిగాయి. పురాతన భారతదేశపు గొప్ప జ్ఞాని ఒకరు, భగవానుని 2500 సంవత్సరాల తరువాతనే ఈ రెండూ భారతదేశానికి తిరిగి వస్తాయి అని చెప్పిన భవిష్యవాణి

ప్రకారంగా, ఆ తరువాతనే అవి భారతదేశానికి తిరిగి రాగలిగాయి. అయినప్పటికీ పరమపూజ్యులైన స్వామీ వివేకానంద గారు బుద్ధ భగవానుని పట్ల చూపించిన శ్రద్ధ కారణంగా నా హృదయంలో బుద్ధ భగవానుని పట్ల ఉన్న భక్తిభావం మరింత పెంపొందింది, నాకు ఎనలేని మేలు చేసింది.

## బుద్ధ భగవానుని గొప్పతనం

బుద్ధ భగవానుని పట్ల స్వామీ వివేకానంద గారి ఈ మనోభావాల కారణంగానే, బుద్ధ భగవానుని పట్ల చిన్నతనంలో నా మనసులో నాటుకున్న మొక్కలు సంజీవనీ పోసి పెంచినట్లు మరింత వృద్ధి చెందాయి. బుద్ధుని యందు శ్రద్ధ పట్ల నాలో పడిన పునాదులు మరింత బలపడుతూ పోయాయి. అవి:

- ఒక వేయి సంవత్సరాల వరకూ ఏ విశాల తరంగమైతే సమగ్ర భారతదేశాన్ని ముంచెత్తిందో, దాని సర్వోన్నత శిఖరంపై ఒక మహత్తరమైన మూర్తిని చూస్తాము. వారే మన శాక్యముని గౌతముడు.
- నడవడికకు సంబంధించినంత వరకూ, ప్రపంచంలోని ప్రజలందరిలో కెల్లా గొప్ప చరిత్రవంతుడు బుద్ధుడే.
- నైతికతని ఇంత గొప్పగా, నిర్భయంగా ప్రచారం చేసిన వ్యక్తి ప్రపంచంలో మరొకరు లేరు.
- ఇతర విషయాలకంటే నేను వారి నడవడిక పట్లనే శ్రద్ధ చూపిస్తాను. వారెంతో సాహసవంతులు, నిర్భయులు, అవధుల్లేని ప్రేమ కలవారు.
- ఎనలేని తెలివితేటలు, అంతులేని శక్తి మరియు విశాల ఆకాశం వంటి ఎల్లలులేని హృదయం కలిగిన వ్యక్తి బుద్ధుడే.
- వారి విశాల హృదయంలో వెయ్యవంతు- హృదయాన్ని పొందినా చాలు, నన్ను నేను ధన్యుడిగా భావిస్తాను.
- తన రాజవైభవాన్ని, అన్ని రకాల సుఖాలను త్యజించిన ఈ రాజకుమారుడు, సముద్రమంతటి తన విశాల హృదయంతో సమస్త మానవులు మరియు జీవజాతుల మేలు కొరకు ఆర్యావర్తంలోని వీధి వీధికీ తిరుగుతూ భిక్షావృత్తితో జీవితాన్ని జీవిస్తూ తన ఉపదేశాలను ప్రచారం చేశారు.
- నిజానికి అన్నివిధాలా నిష్కాముడిగా చెప్పుకోదగిన ఏకైక వ్యక్తి బుద్ధుడే.
- భగవానుడు పరిపూర్ణంగా నిష్కాముడు. కర్మయోగానికి వారు ఒక ఉజ్వల ఆదర్శ స్వరూపులు. వారు చేరుకున్న అత్యున్నత స్థితితో, కర్మశక్తితో మనం కూడా ఉన్నత ఆధ్యాత్మిక స్థాయికి చేరుకోగలము అని తెలుస్తుంది.
- ఇతరులు భక్తి - జ్ఞానము -యోగాల మార్గంతో ప్రాప్తించుకునే పరిపూర్ణ స్థితికి వారు చేరుకున్నారు.
- కేవలం నిష్కామ కర్మయే మానవుడిని పరిపూర్ణత్వం వరకూ చేర్చగలదు.
- ఆ ఎనలేని తెలివితేటలున్న వ్యక్తి ఎన్నడూ అంధవిశ్వాసాలు కలిగి ఉండలేదు.
- వారు ఈశ్వరునికి సంబంధించి ప్రాచుర్యంలో ఉన్న నమ్మకాల్లో దాగి ఉన్న మనోవృత్తిని ఖండించారు. అవి మానవులను బలహీనులుగా, అంధవిశ్వాసంతో నిండేలా చేస్తాయని వారు గమనించారు.
- ఎంతోమంది మహాపురుషులు తమను తాము ఈశ్వరుని అవతారంగా చెప్పుకుంటూ, వారిమీద శ్రద్ధాభక్తులు కలిగి ఉన్న వారు స్వర్గాన్ని ప్రాప్తించుకుంటారు అనే నమ్మకాన్ని కల్పించేవారు. కానీ బుద్ధుని పెదవులపై చివరిక్షణం వరకూ ఉన్న మాటలివే- "మీ ప్రయత్నంతోనే మీరు సద్గతిని పొందగలరు; ఇతరులెవరూ ఇందులో మీకు సహాయం చేయలేరు. మీ ముక్తిని మీరే ప్రాప్తించుకోవాలి".
- ప్రపంచంలోని శిక్షణాచార్యులందరిలోనూ స్వావలంబన బోధనను బోధించిన శిక్షకులు వారొక్కరే. వారు మనల్ని మిథ్యా నమ్మకాల బంధనాల నుండే కాకుండా, ఈశ్వరుడు లేదా దేవతలుగా చెప్పుకునే అదృశ్య శక్తులు, ప్రాణి, ప్రాణుల మీద ఆధారపడటం నుండి కూడా విడుదల చేశారు.
- నీ ముక్తిని నీవే సిద్ధించుకో.
- స్వావలంబులైన వారెవరైనా సుఖంగానే ఉంటారు, పరావలంబులైన వారెవరైనా దుఃఖితులౌతారు.
- బుద్ధుని బోధనల్లో మానవులందరూ సమానమే, ఏ ఒక్కరియందూ పక్షపాతముండదు. బుద్ధుడు సమానత్వాన్ని ఎంతగానో బోధించారు.
- వారు పురోహితులకు మరియు ఇతర జాతి వారికి మధ్య ఉన్న దూరాన్ని తొలగించారు. అధమజాతికి చెందినవారికి కూడా అత్యున్నత ఫలాలను పొందే అధికారముంది.

బుద్ధుని గొప్పదనం పట్ల నాలో ఉన్న నమ్మకం తిరుగులేనిది. వారు ఆ కాలపు సమాజంలో ప్రబలి ఉన్న అంధవిశ్వాసాలను దూరం

చేశారు. ప్రజలను స్వావలంబులుగా తయారుచేశారు. సమాజంలో జాతి–మతాల ఆధారంగా కుష్టువ్యాధి లాగా వ్యాపించి ఉన్న హెచ్చుతగ్గుల భేదభావాలను దూరం చేయటానికి ఎంతగానో ప్రయత్నం చేశారు. ప్రతి వ్యక్తీ, తన మనసును స్ఫటికంలాగా నిర్మలం చేసుకోవటాన్ని నేర్పించారు. ఆ కారణంగానే వారు విశ్వవంద్యులైనారు, విశ్వపూజ్యులయ్యారు. ఇలా నేను విశ్వసించినా కూడా, స్వామి వివేకానందుడు తన గురించి తాను “నేను జీవితాంతమూ బుద్ధుడిని ఆరాధించాను, కానీ ఆయన శిక్షణను కాదు” అని ప్రకటించారంటే బుద్ధుడి శిక్షణలో ఎక్కడో ఏదో లోపము; దోషము తప్పకుండా ఉండే ఉండాలి. అందుచేతనే స్వామిజీ అలా అని ఉంటారు అనుకుని నా మనసులో, బుద్ధుడి శిక్షణ పట్ల అప్పటికే గూడుకట్టుకున్న భ్రమా–భ్రాంతి మరింత ప్రగాఢమైనాయి.

ఈ వాక్యాల కారణంగా, ఆ రోజుల్లో బుద్ధుని బోధనల పట్ల నాలో ఉన్న భ్రమలు, భ్రాంతులు మరింత ప్రగాఢమైనాయి.

స్వామీ వివేకానంద గారి మాటల్లో బుద్ధుని బోధనలను గురించి చదివిన లోటుపాట్లు, లోపాలు నాలో గూడుకట్టుకుపోయాయి. నేను నా మొదటి విపశ్యన శిబిరంలో పాల్గొని, వారి బోధనల శుద్ధమైన వ్యావహారిక పక్షాన్ని స్వయంగా సాధన చేసి చూసి, ఆ తరువాత మూల బుద్ధవాణి యొక్క సార్థక అధ్యయనం కూడా చేసి, బుద్ధుడి శిక్షణ ఆద్యంతమూ దోషరహితమైనది, నిష్కలంకమైనదని పూర్తిగా నిర్ధారించుకోనంత వరకూ నా మనసులో గూడుకట్టుకున్న భ్రమలు దూరం కాలేదు. స్వామీ వివేకానంద గారు కూడా విపశ్యనా సాధన చేయగలిగి ఉంటే బాగుండేది.

– తరువాయి భాగం వచ్చే సంచికలో

– ఆత్మ కథన్ 2 నుండి సంగ్రహించబడినది.


**OWNERSHIP OF VIPASSANA MASAPATRIKA AND OTHER INFORMATION**

| | |
|---|---|
| 1. Name of the Masapartrika | **Vipassana Masapatrika** |
| 2. Registration Nos of the News Paper | APTEL/17745 |
| 3. Language | Telugu |
| 4. Frequency of Publication | Monthly |
| 5. Publisher's Name | Smt. Sabrina Katakam |
| 6. Nationality | Indian |
| 7. Adress | Vipassana International Meditation Centre 12/3 M, Nagarjunasagar Road, Sahebnagar, Vanastalipuram, Hyderabad-500 070. |
| 8.Printer's Name | Sri Y.Venkateswar Rao |
| 9. Nationaity | Indian |
| 10. Address | Flat No.15, Saikrupa Apartments Red Hills, Lakdikapool, Hyderabd - 500 004 |
| 11. Editor's Name | G.V.Subrahmanyam |
| 12. Nationality | Indian |
| 13. Adress | 11-13-114, Road No.2 Alkapuri Colony, Hyderabad - 500 102 |
| 14. Place of Publication | Vipassana International Meditation Centre 12/3 M, Nagarjunasagar Road, Sahebnagar, Vanastalipuram, Hyderabad - 500 070. |

I, Sabrina Katakam, declare that the above mentioned information is true to the best of my knowledge.

**Sabrina Katakam,**
**Publisher**

Date: 1-4-2020

రెండు సంవత్సరాలకు చందా రూ 100/– **విపశ్యన తెలుగు మానవత్రిక** జీవిత చందా రూ. 500/–

ప్రచురణ తేది: ప్రతినెల 30/31 పోష్టింగ్ తేది: ప్రతి నెల 1/2 వెల: రూ 5/–

**విపశ్యన అంతర్జాతీయ ధ్యానకేంద్రం, నాగార్జున సాగర్ రోడ్, వనస్థలిపురం, హైదరాబాదు – 500 070.**

**ఫోన్: 24240290 (ధ్యానకేంద్రం)** ఆఫీసు పనిచేయు వేళలు: ఉదయం 9గం॥ల నుండి సాయంత్రం 5 గం॥ల వరకు

Postal Reg. HSE/864/2019-2021 RNI Reg. No. APTEL/2006/17745


**PRINTED MATTER**

If Undelivered please return to :

**VIPASSANA INTERNATIONAL MEDITATION CENTRE,**
12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram,
HYDERABAD - 500 070.
Website : www.vri.dhamma.org
E-mail : info@khetta.dhamma.org


Published for Vipassana International Meditation Centre, 12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram, Hyd.(A.P)-70 Ph: 040-24240290, Published by Smt. Sabrina Katakam. Editor : Sri G.V.Subrahmanyam., Printed at Sai Likhita Printers, #6-2-959, Dakshin Bharat Hindi Prachar Sabha Complex, Khairatabad, Hyd. Ph : 2332579.